విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వంట గ్యాస్ 50 రూపాయలు పెంపుపై భగ్గుమన్న సీపీఐ

విశాలాంధ్ర - సామర్లకోట : వంటగ్యాస్ ధర పెంపునకు నిరసనగా సామర్లకోట పోస్ట్ ఆఫీస్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, సామానులపై భారం మోపుతారా అంటూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కాస్త విరామం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఉగాది కానుకగా ప్రజలకు చేదువార్త ఇచ్చిందన్నారు. ఇప్పటికే అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు మరలా గ్యాస్ సిలిండర్ రేట్లు పెంచడం దుర్మార్గం అన్నారు. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు పి. సత్యనారాయణ, పిఎస్ నారాయణ, రామదాసు, సత్యనారాయణ రాజు తదితరులు నాయకత్వం వహించారు.

ఆదివారమూ చెత్త సేకరణ... లేదంటే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కాకినాడ : ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందేనని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసి) సిహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన వెంకటేశ్వరకాలనీ ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఇంటింటికి చెత్త సేకరణ, తడి-పొడి చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా వస్తున్నారో లేదో ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఆదివారం చెత్తను తీసుకు వెళ్లేందుకు వాహనాలు రావడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చెత్తను తరలించేందుకు నియమించిన ఏజెన్సీకి ఆదివారం కూడా సొమ్ము చెల్లిస్తున్నామని, అలాంటప్పుడు చెత్తను తీసుకువెళ్లకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏజెన్సీకి సొమ్ములు చెల్లిస్తూ ఆదివారం ప్రజల నుంచి చెత్తను సేకరించకపోతే చెల్లించిన సొమ్మును ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల నుంచి రికవరీ చేస్తామని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చొరవ తీసుకుని నిర్వాహకులతో మాట్లాడాలని, సేవలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్త కిరీటీ

విశాలాంధ్ర - అంబాజీపేట : కొబ్బరి అభివృద్ధి బోర్డు, అంతర్జాతీయ కొబ్బరి సంయుక్త సంస్థ (జకార్త) ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఎ. కిరీటి హాజరయ్యారు. గత నెల 27, 28 తేదీలలో హైదరాబాద్‌లో కొబ్బరిలో వివిధ ఉత్పత్తులు, వాణిజ్యం అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు తెలిపారు.

అమలాపురంలో మాలమహానాడు ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర మాల మహానాడు ప్రాంతీయ కార్యాలయం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సీనియర్ దళిత నాయకులు చిల్లా పురుషోత్తం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జగడం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలందర్నీ ఏకతాటి మీదకి తెచ్చి వారిని విద్యా, ఆర్థిక, సామాజిక రంగాల్లో చైతన్యపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. మాల ఐక్యత ద్వారా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రిజర్వేషన్స్ పెంచే పార్టీకి మద్దతు ఇవ్వనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 27 దళిత సంక్షేమ పథకాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు రేవు తిరుపతిరావు, పులపర్తి వెంకటేశ్వరరావు, పోతుల రవికుమార్, కిత్తన చెరువు సర్పంచ్ సత్యనారాయణ, రాష్ట్ర బేడ బుడగ జంగం, జిల్లా అధ్యక్షులు పేర్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిపోయిన అప్పన్నపాలెం వంతెన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం అప్పన్నపాలెంతో పాటు ఆరు గ్రామాలను కలిపే వంతెన ఒక కాను పూర్తిగా కూలిపోవడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం నుండి అప్పలపాలెం, నరేంద్ర పట్నం, ఇర్రిపాక, పట్టం భావారం, తదితర ఆరు గ్రామాలకు వెళ్లేందుకు ఏలేరు నదిపై 1995 సంవత్సరంలో వంతెన నిర్మించారు. వంతెన నిర్మించి 30 సంవత్సరాలు పూర్తికాకుండానే 2022 సంవత్సరంలో భారీ వర్షాలకు వంతెన పాక్షికంగా దెబ్బతింది. దీంతో ఆటోలు, నాలుగు చక్రాలు వాహనాలు వంతెన పై రాకపోకలను నిషేధించారు. పాదచారులు, ద్విచక్ర వాహనాలు ప్రయాణాలు సాగించేవారు. బుధవారం ఉదయం ఒక్కసారిగా ఒక కాను కుప్ప కూలిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వంతెన నిర్మాణ సమయంలో వాడిన ఇనుము అత్యంత నాసిరకంగా ఉందని అనడానికి శిథిలావస్థలో బయటపడిన నాసిరకం 8 ఎంఎం ఊసలు ఇందుకు నిదర్శనం అని ప్రజల వద్ద నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. సరైన సమయంలో వంతెనకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈరోజు వంతెన కూలిపోవడం కారణమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇద్దరు ముద్దాయిలకు ఆరు నెలల జైలుశిక్ష

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలోని కాలేరులో 2022 అక్టోబర్‌లో ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు కోర్టు జడ్జి కె. దీప దైవకృప తీర్పు చెప్పినట్టు అంగర ఎస్సై జి. చంటి తెలిపారు. బాధితుడు గొడితి సత్యనారాయణ ఫిర్యాదుపై అప్పటి ఎస్సై బి. సంపత్‌కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ శివగణేష్ విచారణ చేపట్టారు. ఫిర్యాది తరపున ఏపీపీ ఆకుల శ్రీరాములు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు పెచ్చెట్టి విజయ్, గెద్దాడ సురేంద్రలకు జైలు శిక్ష విధిస్తూ జడ్జి దైవకృప తీర్పు చెప్పారని ఎస్సై చంటి తెలిపారు.

గ్యాస్ ధరల పెంపు ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - అమలాపురం : కేంద్ర బీజేపీ ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రు.50, వాణిజ్య సిలెండర్ రు.350 పెంచడాన్ని సిపిఐ(ఎం) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. ప్రజలు ఎక్కడి కక్కడ నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చింది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలో రెండు సార్లు పెంచడం దారుణమని పేర్కొంది. . పెంచిన ధర ఉపసంహరించేవరకు ఎక్కడికక్కడ నిరసనలు చేయాలని ప్రజలకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గాప్రసాద్ పి.వసంతకుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు.

భవన నిర్మాణ కార్మికులతో చెలగాటమాడితే గద్దె దింపుతాం

విశాలాంధ్ర - పెద్దాపురం : భవన నిర్మాణ కార్మికులతో ప్రభుత్వం చెలగాటమాడితే గద్దె దింపుతామని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పేర్కొన్నారు.

పెద్దాపురంలో పట్టణ తాపీ పనివారల సంఘం ఏఐటియుసి అనుబంధ హాలులో బుధవారం పెద్దాపురం డివిజన్ ఏఐటియుసి మహాసభ పిఎస్ నారా యణ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. మొదటగా ఏఐటీయూసీ జెండాను తాటిపాక మధు ఆవిష్కరణ చేశారు. సమావేశంలో తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలన్నీ తుంగలో తొక్కిందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు వాడుకుంటూ కార్మికులను నిలువునా మోసం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా భవన నిర్మాణ కార్మికులతో చెలగాడ మాడితే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని మధు హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణరంగంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులు భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయా లన్నారు. పరిశ్రమల్లో మొదట ప్రాధా న్యత స్థానికులకు కల్పించాలని, అలా కాకుండా తక్కువ వేతనాల కొరకు ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చి వారిచే పనులు చేస్తే స్థానికంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, అనుమతులు లేకుండా పరిశ్రమలు నిర్వహిస్తున్న యాజ మాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రసాద్ అన్నారు. మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా మంచిన భాస్కరరావు, కసింకోట కిషోర్, గోకాడ బాబురావు, ప్రధాన కార్యదర్శిగా పెద్దిరెడ్ల సత్యనారాయణ, కార్యదర్శులుగా పితాని సాయిబాబా, యండమూరి సత్యనారాయణ, బొట్టు త్రిమూర్తులు, కోశాధికారిగా రేఖ రామకృష్ణ ఎన్నికయ్యారు.

బాల్య వివాహ నిషేధ చట్టం పటిష్ట అమలుకు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : బాల్య వివాహ నిషేధ చట్టం-2006ను పటిష్టంగా అమలుచేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో, బృంద స్ఫూర్తితో పనిచేయాలని కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ అన్నారు. బుధవారం కలెక్టరేట్ విధానగౌతమి సమావేశ మందిరంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు, చైల్డ్ బెగ్గింగ్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అనాథలు, పాక్షిక అనాథల గుర్తింపు ప్రక్రియ తదితర అంశాలపై కాకినాడ డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డీవో బీవీ రమణ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం పటిష్ట అమలుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది.. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ప్రధానంగా బ్లాక్‌స్పాట్స్‌పై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమం సందర్భంగా ఆర్‌డీవో.. ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులతో కలిసి బాల్య వివాహం అంటే బాలల వేధింపే శీర్షికతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం: ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి:- ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు సమన్వయ శాఖల అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. (. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.13లోని అంశాలను డీసీపీవో సీహెచ్ వెంకటరావు వివరించారు. సమావేశంలో డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సీడీపీవో దుర్గాదేవి, మెడికల్ ఆఫీసర్ డా. ఎల్.పావని, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

జగనన్న భూ హక్కు సర్వే రాళ్ల నిర్మాణం పనులకు రైతన్నలు సహకరించండి

విశాలాంధ్ర - ఆలమూరు : జగనన్న భూహక్కు సర్వేలో భాగంగా సరిహద్దుల్లో రాళ్ల నిర్మాణం పనులకు రైతన్నలు సహకరించాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి అన్నారు. బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామంలో ఆర్డీవో ఎం.ముక్కంటి సాధారణ రైతన్నవలే పొలం గట్టుపై కూర్చుని ఇన్‌చార్జి తహసీల్దారు జెడి కిషోర్ బాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, రెవిన్యూ సిబ్బందితో కలసి స్థానిక రైతులకు జగనన్న భూ హక్కు సర్వేరాళ్ల నిర్మాణం పనులుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా సర్పంచ్ ఉండ్రాసుపు లక్ష్మీమౌనిక, చిన్న దంపతుల ఆధ్వర్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికి దుశ్శాలువాలు కప్పి, ఇండోర్ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ రీ సర్వేలో భాగంగా సర్వే రాళు నిర్మాణం పనులు రైతన్నల సమక్షంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని గ్రామంలోని ప్రతి రైతన్నలు కూడా ప్రస్తుతం వరి సాగు చేస్తున్న సందర్భంగా మీ మీ పొలంలో అధికారులు సర్వే రాళ్లు నిర్మించే సమయంలో ఇరుపక్షాల రైతులు ఉండాలని ఆయన తెలియజేసి పలుసూచనలు సలహాలు వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భూ రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం. జానకి రాఘవ, పంచాయతీ కార్యదర్శి మోక్షంజలి, ఉండ్రాసుపు చిన్న, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వద్దు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట డివిజన్ రామవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎలియాజం, గ్రామ సర్పంచ్ వత్సవాయి సత్యనారాయణ, మాస్టర్ ట్రైనర్ సంతోష్, బుగత అరుణ ఆధ్వర్యంలో బుధవారం నవధాన్యాల సాగు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ సంతోష్ మాట్లాడుతూ ప్రధాన పంటలైన ఖరీఫ్, రబీ పంటలకు ముందు భూసారం పెంచడానికి నవధాన్యాల పాత్ర ముఖ్య మన్నారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో అధిక సంఖ్యలో సూక్ష్మజీవులు, సూక్ష్మ పోషకాలు పెంపొందించడం వల్ల ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు, అవసరం లేకుండా అధిక దిగుబడితో పాటు నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలు పండించడం జరుగుతుంది. నవ ధాన్యాల సాగుతో భూములు జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభ్యం అయ్యి భూములు తేమశాతం పెంచడమే కాకుండా అధిక దిగుబడులను ఇస్తాయన్నారు. అనంతరం రసాయన ఎరువులు వద్దు-నవధాన్యాలు ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యూపీ స్కూల్ హెచ్‌ఎం, ఎర్ర అగ్నేశ్వర రావు , గ్రామ సర్పంచ్ వత్సవాయి సత్యనారాయణరాజు, వీఏఏ రామలింగేశ్వర రావు, డ్వాక్రా యానిమేటర్లు, గ్రామ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన గ్యాస్ ధరలు

విశాలాంధ్ర - కరప : రాష్ట్రంలో పెట్రోల్ నుంచి గ్యాస్ వరకు ధరలు పెంచడం పేదల పాలిట శాపంగా మారిందని కాకినాడ రూరల్ మాజీ శాసన సభ్యురాలు పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. కరప మండలం పెనుగుదురు గ్రామంలో రాష్ట్రానికి ఇదేం కర్మ, ఇంటింటికి పిల్లి అనంతలక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్దకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం ప్రజలపై పెనుభారంగా బాదుడే బాదుడు అన్న రీతిలో ధరలు పెంచుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మహేంద్ర బాబు, పులుపుకూర శుభ మహేష్, వై సుకుమార్, పంపన కన్నారావు, కాకర్ల బుజ్జిబాబు, సింహాద్రి తదితర నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన

విశాలాంధ్ర - గోపాలపురం : వర్జినియా పొగాకు గ్రేడింగ్‌లో అన్యపదార్థాలు రాకుండా బ్యాళ్లను సిద్ధపరచు కోవాలని ఐటీసీ మేనేజర్ యశ్వంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో దేవరపల్లి టుబాకో బోర్డు ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులు వాడుట వల్ల పొగాకు ఉత్పత్తుల దిగుబడిని గూర్చి రైతులకు అవగాహన, గ్రేడింగ్ లో తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పొగాకు తోటల పెంపకంలో ఆర్గానిక్ ఎరువులు వాడి పొగాకు ఉత్పత్తులను కొనసాగించాలని తెలిపారు. రసాయనిక ఎరువులు వాడకం ద్వారా పర్యావరణం పూర్తిగా కాలుష్యం అవుతుందని అది ప్రాణహాని పలు రోగాలకు దారి తీస్తుందని తెలిపారు. తోటల పెంపకం సమయంలో వచ్చే వ్యాధులను గూర్చి పొటాషియం బ్యాక్టీరియా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జివిఎల్‌కె ప్రకాష్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి నిజాయితీ

విశాలాంధ్ర - కరప : గురజనాపల్లి శ్రీ పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం పాఠశాల నుంచి విద్యార్థులు అందరూ తమ తమ పుస్తకాలను తీసుకుని ఇంటికి వెళ్ళినప్పుడు, 5వ తరగతి చదువుతున్న కేదారశెట్టి వెంకట సాయికృష్ణకు 500 రూపాయలు నోటు పాఠశాల ఆవరణలో దొరికింది. వెంటనే ఆ నోటును తీసుకుని ప్రధాన ఉపాధ్యాయులు బిఆర్‌వి ప్రసాదరావుకు అందజేశాడు. దీంతో అక్కడే ఉన్న స్టాఫ్ సెక్రటరీ ఐ ప్రసాదరావు, ఉపాధ్యాయులు వివి రమణమూర్తి, ఏ సూర్య నారాయణ ఉపాధ్యాయులు విద్యార్థి నిజాయితీని అభినందించారు. హానెస్టీ ఈజ్ బెస్ట్ పాలసీ" అనే భావనను చిన్న తనంలోనే ఆచరించి చూపిన వెంకట సాయికృష్ణను పాఠశాల అసెంబ్లీలో మెడల్‌తో అభినందించారు. 500 రూపాయలు ఎవరివి అని, ఆరా తీయగా పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న యమ్ రామ్మోహన్‌వి అని తెలిసి, విద్యార్థి వెంకట సాయి కృష్ణ చేతులు మీదగా మాష్టారుకు అందించారు.

అశ్లీల చిత్రాలను వాట్సప్ చేసిన నిందితుడికి రిమాండ్

విశాలాంధ్ర - కాట్రేనికోన : మైనర్ బాలికను వివాహం చేసుకొని, ఆమె అశ్లీల చిత్రాలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేసిన వ్యక్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే మండలంలోని బలుసుతిప్ప గ్రామంలో గత నెల 8వ తేదీన మైనర్ బాలికను వివాహం చేసుకొని, మొదటి రాత్రి ఆమె ఏకాంతంగా ఉన్న చిత్రాలను తీసి, వాట్సాప్ ద్వారా ప్రచారం చేసిన ఘటనపై గత నెల 20వ తేదీన ఆమె తల్లి కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై టి శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా, ముమ్మిడివరం సిఐ జానకిరామ్ విచారణ చేపట్టి ఫిబ్రవరి 28వ తేదీన నిందితుడు మల్లాడి వీరబాబును అరెస్ట్ చేసి, ముమ్మిడివరం కోర్టు ముందు హాజరు పరచగా ముమ్మిడివరం మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

పశువులతో ప్రయాణికులకు ఇబ్బందులు

విశాలాంధ్ర- ముమ్మిడివరం : నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై రాత్రి సమయంలో ఆవులు విచ్చల విడిగా సంచ రిస్తు న్నాయి. వీటిని గమ నించని వాహన దారులు ప్రమాదానికి గురవు తున్నారు. రహదారికి అడ్డంగా నిలబడి వాహనాలకు సైతం దారి ఇవ్వని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వీటిని కట్టడి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా పెంకే విశ్వేశ్వరరావు

విశాలాంధ్ర - కాజులూరు : మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా కాజులూరుకు చెందిన పెంకే విశ్వేశ్వరరావు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం దుగ్గుదుర్రులో జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడుగా పెంకే విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా దెయ్యాల సత్తిబాబు, కార్యదర్శిగా సరాళ శ్రీను, ట్రెజరర్ కట్టా సత్యనారాయణను మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగానూ సంఘ సభ్యులు ఎన్నుకున్నారు.

IN THE COURT OF THE 2nd ADDL. SENIOR CIVIL JUDGE :: KAKINADA
I.A. 620/2022 In F.D.P. 330/2013
in O.S. 512/1993

Between:
J.V.S. SURAJ ...Petitioner / 3rd Party
and
MUMMIDI ASHIK AND OTHERS ...Respondents

To,
28) M. Seshaveni, W/o. (Late) Dharmayya, Aged 52 Years, House Wife, R/o. D.No. 15-11-10, Satya Prasanna Nagar, Kakinada, Kakinada JCJC.
32) B. Venkata Ramana, S/o. Byra Satyavathi, Aged 47 Years, R/o. D.No. 22-3-5, Deepalavari Street, Kakinada, Kakinada JCJC.
33) B. Satyanarayana, S/o. Byra Satyavathi, Aged 41 Years, R/o. D.No. 22-3-5, Deepalavari Street, Kakinada, Kakinada JCJC.

పై నెంబరు పిటీషన్‌లో కోర్టువారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించినప్పటికీ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు అందువలన మీ హాజరు నిమిత్తం కోర్టువారు ది. 09-03-2023వ తేదీనాటికి వాయిదా వేసియున్నారు. అందువలన ఆ రోజున ఉదయం గం. 10-30 ని.లకు మీరు స్వయముగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరయ్యి మీకు అభ్యంతరములున్న యెడల తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమున పిటీషను తీర్మానించెదరు.

|| By Court Order ||
Ch. శ్రీరామచంద్రమూర్తి, అడ్వకేట్
కాకినాడ ప్రకాష్ నగర్, కాకినాడ.
తేది: 01-03-2023 సెల్: 9494135553

గాలికుంటువ్యాధి టీకా కార్యక్రమం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర ప్రభుత్వ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ తెలిపారు. బుధవారం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ వద్ద గల జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని జేసీ ఇలక్కియ పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్. సూర్యప్రకాశరావు ఇతర పశు వైద్య అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2 లక్షల 90వేల పశువులకు టీకాలు వేయించాలనే లక్ష్యంతో మార్చి 1 నుంచి 31 వరకు గాలికుంటువ్యాధి టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని 2019వ సంవత్సరంలో ప్రారంభించిందని, 2025 నాటికి గాలికుంటు వ్యాధి నియంత్రణ ప్రణాళికతో పని చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఒక పశువు నుంచి మరో పశువుకు త్వరగా వ్యాధి సంక్రమిస్తుందని, ఈ వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి బాగా తగ్గి రైతుకు నష్టం కలుగుతుందన్నారు. అనంతరం గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్ ను జేసీ ఇలక్కియ..పశువైద్య అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీలు డాక్టర్ ఆర్.వెంకటరామయ్య, డాక్టర్ జి. శ్రీనివాసు, ఏడి హెచ్ డాక్టర్ నిర్మలాకుమారి, ఇతర పశువైద్య అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో పర్యవేక్షణా లోపంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండలంలో నూతనంగా ఏర్పడిన పంచాయతీలతో కలిపి మొత్తం 21 ఉన్నాయి. వీటిలో మేజర్ పంచాయతీలైన రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి ఉండగా వీటిలో రఘుదేవపురం, చినకొండేపూడిలకు జూనియర్ అసిస్టెంట్ సాయిని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా నియమించారు. ఇక సీతానగరం పంచాయితీకి ఆర్. సుజాత పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండగా అదనపు బాధ్యతగా పిఓపిఆర్డి విధులను అప్పగించారు. అసలే సీతానగరం మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఉండగా ఇక్కడ పిఓపిఆర్డిగా పోస్టింగ్ వచ్చిన మూర్తిని కొద్ది నెలల క్రిందట తాత్కాలికంగా గోకవరం మార్చారు. గోకవరం మండలంలో పిఓపిఆర్డి, ఏవోలు పోస్టులు ఉన్నప్పటికీ సీతానగరం పిఓపిఆర్డిని గోకవరం బదిలీ చేయడం పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. బదిలీ అయిన నాటి నుండి నేటి వరకు సీతానగరం మండలంకు పిఓపిఆర్డి పోస్టు భర్తీ కాలేదు.దీనితో గ్రామాల్లో పారిశుధ్యం పై సరైన నిఘా లేకపోవడంతో కొన్ని పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు, నాయకులు స్పందించి మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, పిఓపిఆర్డి పోస్టును వెంటనే భర్తీ చేయించి పారిశుధ్య నిర్వహణ గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నైపుణ్యత పెంపునకు ప్రాజెక్టులు దోహదం

విశాలాంధ్ర-దేవరపల్లి: విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు సైన్స్ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని మండల ఎన్ ఆర్ జి ఎస్ జాయింట్ ఇంజనీర్ చిట్టూర రమాదేవి అన్నారు. దేవరపల్లి భాష్యం స్కూల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన చూసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చేసిన హైడ్రాలిక్ బ్రిడ్జిచ సోలార్ ఎనర్జీ హార్వెస్టింగ్, ఫైర్ అలారం, వాతావరణం సూచిక ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి ముందుగా సివి రామన్ చిత్రపటం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి. పేరయ్య నాయుడు, షబానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లీనరీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తీర్మానం

విశాలాంధ్ర - గోపాలపురం : దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కల్పిస్తామని కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారని పిసిసి కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యేష్ఠ సతీష్ బాబు తెలిపారు. బుధవారం సతీష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నయా రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ విజయవంతమైందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు రైతులు, యువత, మహిళా సాధికారతకు పలు కీలకమైన తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు దిశా నిర్దేశం చేసారన్నారు. ఈ అంశంపై హర్షం వ్యక్తం చేసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టపర్తి రామ్మోహనరావు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గన్నిన రామారాయుడు,రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ పిట్టా రామారావు,మండల ఎస్సీ,బీసీ సెల్ చైర్మన్లు కౌలూరి బాబాజీరావు,సూరిబోయిన సోమరాజు,మాజీ సొసైటీ ఉపాధ్యక్షులు పెండ్యాల పరమేశ్వరరావు,బొబ్బర రాజేంద్ర తదితరులు ఉన్నారు.

సీఎంకు వీరబాబు వినతిపత్రం

విశాలాంధ్ర - కొత్తపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర గౌడసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్ట వీరబాబు కలిశారు. గౌడ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో గౌడ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం అందజేసినట్లు వీరబాబు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించి అభ్యర్థనను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సంగాయి గూడెం గ్రామ సర్పంచ్ కరుటూరి ఉషారాణి అన్నారు. దేవరపల్లి మండల సంగాయి గూడెం అంబేద్కర్ యూత్‌కి వాలీబాల్ కిట్టును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కరుటూరి ఉషారాణి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి ఎంతో దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కరుటూరి శ్రీనివాస్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టార్టప్ ఏర్పాటులో అగ్రస్థానంలో నిలవాలి

విశాలాంధ్ర -భీమవరం: స్టార్టప్ ఏర్పాటులో ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ పేర్కొన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్ కు చెందిన పలువురు విద్యార్థులు డాక్టర్ ఎం.సురేష్ బాబు పర్యవేక్షణలో భీమవరం ఆన్ లైన్ క్యాంపస్ కేఫ్ బై ఎస్.ఆర్.కె.ఆర్. ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి రాజశేఖర్ పర్యవేక్షణలో అంధుల కోసం స్మార్ట్ విజన్ బై ఎస్ ఆర్ కె ఆర్ అనే స్టార్టర్‌ను టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో రూపొందించారు. రెండు స్టార్టప్పులకు ఇటీవల ఎన్ ఐ టి తాడేపల్లిగూడెంలో జరిగిన వాల్కాన్సి ఫెస్ట్- 23 లో రెండు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో నిశాంత్ వర్మ విద్యార్థులను టెక్నాలజీ సెంటర్ హెడ్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు దేశం నలుమూలల జరిగిన పలు హేకతాన్ పోటీల్లో ప్రథమ ద్వితీయ స్థానాలు పొంది దేశంలోనే కళాశాలకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, సి ఎస్ డి విభాగం హెడ్ డాక్టర్ ఎం. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో ఆరుగురు ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: అపోలో ఫార్మసీ, మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ గణపవరం వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆరుగురు అభ్యర్థులు ఎంపికైనట్లు శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 11 వేల రూపాయలు వేతనం ఉంటుందని ఆమె అన్నారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు కళాశాల జెకెసి కోఆర్డినేటర్ పి. మధురాజు, కళాశాల నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ టి అక్కిరాజు, ఐవిఎల్ఆర్‌కే ప్రసాద్‌లను కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల కుమారి అభినందించారు. భవిష్యత్తులో జరిగే క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక అవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డివివి చిన సత్యనారాయణ, అధ్యాపక, అధ్యాపకు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి వీరవల్లికి మద్దతు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన వీరవల్లి చంద్రశేఖర్‌కు జిల్లా పంచాయతీ ఛాంబర్ తరపున మద్దతు తెలియ జేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సలహాదారులు పిల్లి సత్తిరాజు, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు కడలి గోపాలరావు తెలిపారు. నగరంలోని ప్రైవేటు హోటలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. పార్టీలకు వ్యతిరేకంగా పనిచేస్తామని పంచాయతీరాజ్ ఛాంబర్ లో అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులు ఉన్నారని తెలిపారు.పిల్లి సత్తిరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున పోటీ చేసిన నలుగురిలో ఒకరిని మద్దతుగా ఎన్నుకున్నామని కేవలం రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలకు వ్యతిరేకంగా పంచాయతీరాజ్ ను బలోపేతం చేయడానికి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ లకు గౌరవ వేతనాలు పెంచే వీలుగా తాము ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని నిలబెడుతున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్ని బలపరచాలన్నారు. మిగిలిన సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్ ను బలపరిచేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామని తెలిపారు.

5న భోగేశ్వరస్వామి వారికి 16 రోజుల పండుగ

విశాలాంధ్ర - కలిదిండి: ఈనెల 5న పాతాళ భోగేశ్వర స్వామి వారి సన్నిధిలో భోగేశ్వర స్వామి వారికి 16 రోజుల పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కలిదిండి శివారు భోగేశ్వర లంకలో స్వయంభుగా కొలువైన శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారి వార్షిక మహాశివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగించుకొని ఈనెల 5వ తేదీ ఆదివారం స్వామివారి సన్నిధిలో ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధర్ శర్మ మరియు ధర్మకర్తల మండలి పరివేక్షణలో 16 రోజుల పండుగ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, పూర్ణాహుతి అనంతరం దాతలు సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తునట్లు తెలిపారు. భక్తులు అత్యధికంగా విచ్చేసి స్వామివారి దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించి 16 రోజుల పండగను విజయవంతం చేయలని కోరారు.

శ్రీ జగదాంబ అమ్మవారిని దర్శించుకున్న పొన్నాల అనిత

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: శ్రీ జగదాంబ అమ్మవారిని ఉత్సవాలు పురస్కరించుకొని బుధవారం మాజీ మంత్రి కీ.శే. కోటగిరి విద్యాధరరావు తనయురాలైన పొన్నాల అనిత దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు గరగ నృత్య వాయిద్యాలతో ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏట ఉత్సవాలు జరిగేటప్పుడు అమ్మవారిని దర్శించుకుంటానని ఆమె తెలిపారు జగదాంబ అమ్మవారు అంటే నాకు ప్రత్యేకమైన ఇష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చాట్రాతి భవాని శేఖర్, వైస్ చైర్మన్ చిట్టి బొమ్మ సతీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరమ్మ ఉత్సవాలు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెంలోని ప్రఖ్యాతిగాంచిన సరమ్మ ఉత్సవాలు బుధవారం ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 12 వరకు జరుగుతాయి. అమ్మవారి ఊరేగింపు ఐదు రోజులపాటు జరుగుతుంది. ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ప్రతీరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తుల సదుపాయం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

లిటిల్‌బడ్స్ స్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక పడమర వీధిలోని లిటిల్‌బడ్స్ స్కూలులో సైన్సు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన సైన్సు నమూనాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు సైన్సు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల గురించి వారు పొందిన నోబుల్ బహుమతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-తణుకు: పట్టణం లోని 2వ వార్డు కు చెందిన నక్క వెంకటేశ్వరరావు కుమారుడు నక్క మను అనే దివ్యాంగుడుకి తణుకు పట్టణం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పంతం నానాజీ ఆర్థిక సాయంతో బుధవారం తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు చేతులమీదుగా వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తణుకు పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, తణుకు మండలం అధ్యక్షులు చిక్కాల వేణు,ఇరగవరం మండలం అధ్యక్షులు ఆకేటి కాశి కేశవ, నాలుగో వార్డ్ జనసైనికులు పవన్ కుమార్, మహమ్మద్ రియాజ్, చింతపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవాలని ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో బుధవారం మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన పరింపూడి గ్రామపంచాయతీకి పిఎసిఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు తల్లి మంతెన సూర్యవతి జ్ఞాపకార్థంగా ట్రాక్టర్ను అందజేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, వైసిపి నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుబాయిలో ప్రపంచ పద్మశాలి సమ్మిట్

విశాలాంధ్ర - తణుకు : దుబాయ్‌లో ఈ నెల 26,27 తేదీల్లో ఎన్ఏపిఏ వారి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పద్మశాలిల సమ్మిట్ కార్యక్రమానికి మాజీ చేనేత కార్పొరేషన్ చెర్మన్ వావిలాల వెంకట రమేష్ సరళా దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వావిలాల సరళా దేవి మాట్లాడుతూ ఇంత మంది పెద్దలు పాల్గొన్న ఈ సభలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. దాదాపు 15 దేశాల ప్రముఖులు పాల్గొన్న ఈ సభకు తనను ఎంపిక చేసి అతిథి గా ఆహ్వానించి నా కంటూ ప్రత్యేక గుర్తింపు గౌరవాన్ని ఇచ్చిన ఈ ఆర్గనైజేషన్ లో వర్క్ చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.పద్మశాలి ల ఉనికిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పద్మశాలి లకు ఉన్నత మైన పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. అనంతరం వావిలాల వెంకటరమేష్ సరళాదేవి దంపతులను ఆర్గనైజేషన్ సభ్యులు హరి, గుత్తికొండ రవిచంద్రా, మహిళా కమిటీ అధ్యక్షులు సరస్వతి తదితరులు శాలువాతో మెమెంటోతో సత్కరించారు. ఈ సభలో దేశవిదేశాల్లో పెద్దలు పద్మశాలి ల ఐక్యతా. ఆర్థిక. సామాజిక. రాజకీయ ప్రయోజనాల.అభివృద్ధి వంటి అంశాల పై చర్చించారు. అనంతరం పద్మశాలి లోగో ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ ఎల్.రమణ,మాజీ ఎమ్మెల్యే రాములు, ఎన్ఏపిఏ సృష్టి కర్త, మాజీ మంత్రి గుండు సుధారాణి, ఆంధ్రా నుంచి ఆప్కో చేనేత కార్పొరేషన్ చైర్మన్ జి.చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాస్,అఖిల భారత పద్మశాలి అధ్యక్షులు కందగట్ల స్వామి, వైజాగ్ నుంచి ప్రొఫెసర్ కల్యాణి,ఆంధ్ర కోఆర్డినేటర్ పంచుమర్తి భీమేష్, ఆకుల నాగేశ్వరరావు.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారులకు బెల్లం అమ్మరాదు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేసే వ్యక్తులకు వ్యాపారస్తులు బెల్లం అమ్మ రాదని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ అన్నారు బుధవారం ఎస్ ఈ బి పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని బెల్లం వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్, ఎస్ ఈ బి అడిషనల్ ఎస్పీ, ఏటీవీ రవికుమార్ ఆదేశాల మేరకు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించామని తెలిపారు నాటుసారా తయారు చేసే వ్యక్తులకు బెల్లం అమ్మ రాదని, ఎవరికైనా అధిక మొత్తంలో బెల్లం వారి అవసరాలు నిమిత్తం అమ్మ వలసి వస్తే వారి నుంచి సరైన ధ్రువ పత్రాలు కాపీలు తీసుకొని అమ్మ వలసినదిగా వ్యాపారాలకు సూచించారు అపరిచిత వ్యక్తులు వ్యాపారం చేయనివారు ఐదు కేజీల నుంచి బెల్లం కొనుగోలు చేస్తే వారి సమాచారం అందించాలని సూచించారు నాటు సారా తయారీలో బెల్లం ముడి సరుకు అని తెలిపారు వ్యాపారస్తులు దానిని కట్టడం చేస్తే నాటుసారా తయారీ నిలిచిపోతుందని అన్నారు. ఈ సమావేశంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఈత కోట తాతాజీ, ఉపాధ్యక్షులు కొవ్వూరీ నాగేంద్ర రెడ్డి, బెల్లం వర్తకులు, ఎస్ఈబి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ గంజిమల రామారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంజిమల రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రామారావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, మండలంలో ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా వచ్చి తెలియజేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాక్షి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21వరకు జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర-ఏలూరు: జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21 వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింట సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా అదనపు వైద్యాధికారిణి ఎయిడ్స్ లెప్రసీ, టిబి డాక్టర్ జి. రత్నకుమారి తెలిపారు .ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు వైద్యాధికారిణి డా.జి . రత్నకుమారి గజ్జెలవారిచెరువు నుండి ప్రారంభించారు. పట్టణ పరిధిలోని ప్రజలెవరికైనా స్పర్శలేని మచ్చలుకాని కాళ్ళు, చేతులు తిమ్మిర్లు ఉండటం కాని కనురెప్పలు మూతపడకపోవడం కాని, చెవులు వాపు, బుడిపెలు, కాళ్ళు చేతులు పట్టుయివ్వకపోవడం వుంటే మీ దగ్గరలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్ష చేయించుకోవచ్చునన్నారు. ఈ వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లయితే అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో యండిటి చికిత్స పూర్తిగా ఉచితంగా యివ్వబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గజ్జెలవారిచెరువు వైద్యాధికారి సిబ్బంది, హెచ్ఈఓ కె . సత్యానందం, డిపియంఓ కె. సత్యనారాయణ , బాలకృష్ణ, యంపిహెచ్ఐస్ సాగర్ పాల్గొన్నారు.

3 నుంచి కళ్యాణోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - మామిడికుదురు : ఈ నెల మూడవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు మాకనపాలేం గ్రామంలో శ్రీ అనంత లక్ష్మీ భూదేవీ సమేత శ్రీశ్రీశ్రీ సత్యనారాయణ స్వామి వారి 71వ దివ్య తిరు కళ్యాణోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ రాత్రి 9 గంటలకు శ్రీ పద్మావతి కళ్యాణం, కాదంబరి కంజరి కథ, 4వ తేదీ రాత్రి 10 గంటలకు భరత నాట్యం, 5వ తేదీ రాత్రి 10 గంటలకు శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం నాటకం, 6వ తేదీ రాత్రి 10 గంటలకు శ్రీ రామాంజనేయ యుద్ధ నాటకం 7 తేదీ ఉదయం 10 గంటలకు అన్న సమారాధన, రాత్రి 10 గంటలకు బాల నాగమ్మ నాటకం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెంకన్న కళ్యాణోత్సవాలకు ముహూర్తపు రాట

విశాలాంధ్ర - అమలాపురం : పెళ్లిళ్ల వెంకన్నగా ఖ్యాతికెక్కిన అమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 28నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద ముహూర్తపు రాట పాతారు. మార్చి నెల 28వ తేదీన స్వామివారిని పెళ్లి కుమారుడిని చేయడంతో మొదలయ్యే కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 8న శ్రీ తెప్పోత్సవం వరకూ 12 రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ చైర్పెర్సన్ దూడల విరీతదేవి ఫణి తెలిపారు. కొత్త పాలకవర్గం ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి ప్రోత్సాహకర్త యెందురి నాగేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు యెందురి రాఘవ, నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, కుసుమ శ్రీను, ముంగర ప్రసాద్, కాశే ఆది పట్టాభిరామయ్య, బరణికాన బాబు, ఈఓ డి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ప్రారంభోత్సవంలో దాట్ల సుబ్బరాజు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు పంచాయతీ రంగనాయక పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మిడివరం నియోజకవర్గం ఇన్‌చార్జి దాట్ల సుబ్బరాజు, ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళి పూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యానారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, రామకృష్ణంరాజు, వాశంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సీతానగరం : మృతుడి కుటుంబానికి సీపీఐ ఏమ్ ఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని చినకొండేపూడి గ్రామానికి చెందిన ఎం. నాని కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారనే విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న మండల మహిళా అధ్యక్షురాలు పలివెల వీరబాబు జ్యోతి దంపతులు మృతుని కుటుంబానికి ధైర్యం చెప్పి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చిట్టి స్వామి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

భాష్యం రామకృష్ణ జన్మదినం

విశాలాంధ్ర-దేవరపల్లి: భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జన్మదిన సందర్భంగా దేవరపల్లి భాష్యం స్కూల్ విద్యార్థులు మండలం లోని గొల్లగూడెం భారతి వికలాంగుల ఆశ్రమానికి వెళ్లి వృద్ధులకు పండ్లు, బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కాగిత భాస్కరరావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పి.పేరయ్య నాయుడు, చాంప్స్ ప్రిన్సిపాల్ షబానా, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - అనపర్తి : కోట్లాది రూపాయల వ్యయంతో అనపర్తి మండలం రామవరం లో నిర్మించే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మండపేట మెహర్ ఆయిల్ ఇండస్ట్రీస్ చైర్మన్ చింతా రామకృష్ణారెడ్డి వీరలక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారు. బుధవారం ప్రముఖ పారిశ్రామికవేత్త, రామచంద్ర పేపర్ మిల్ (ఏడిద) అధినేత మేడపాటి రామలింగారెడ్డి పర్యవేక్షణలో ప్రముఖ వేద పండితులు మిక్కిలినేని దుర్గయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి దంపతులతో గణపతి హెూమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనగా కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా మేడపాటి రామలింగారెడ్డి మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అత్యాధునికంగా కొట్లాది రూపాయలతో నిర్మించనున్నట్లు తెలిపారు. రామవరం గ్రామాన్ని ఆధ్యాత్మిక గ్రామంగా తీర్చేదిద్దాలనే వాంఛతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

ప్రిన్సిపల్ సాల్మన్ రాజు సస్పెన్షన్

విశాలాంధ్ర-పెడన: పెడన పట్టణంలో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్ రాజు వ్యవహార సరళి పలు వివాదాలకు తావిస్తోంది. ఇటీవల పట్టణంలో పెద్ద పెద్ద వృక్షాలు కొట్టి సొమ్ము చేసుకోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగింది.తాజాగా బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సరైన వసతులు లేవని ఆర్ఐ.ఓ కు లేఖ రాయడం వివాదాస్పదమైంది. కళాశాల విద్యా కమిటీకి తెలియకుండా తోటి అధ్యాపకులకు ఏమాత్రం చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పట్టణంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్ రాజును ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ ఎంవీ శేషగిరి బాబు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సాల్మన్ రాజు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గత ఏడాది ఆగస్టు 29వ తేదీన కళాశాల సివిక్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కే రాజ్యలక్ష్మి భర్త సతీష్ కుమార్ పై మచిలీపట్నం చిలకలపూడి పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 2న ఈ ఫిర్యాదు పై డిఐఈఓ బొడ్డు ప్రసాద్ నిర్వహించిన విచారణకు సాల్మన్ రాజు గైర్హాజరయ్యారు. పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు పై ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడం ఈ ఫిర్యాదు పై నిర్వహించిన విచారణకు హాజరు కాకపోవడం సి. సి రూల్స్ కి వ్యతిరేకం. దీంతో సాల్మన్ రాజు ను కమిషనర్ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్లానింగ్ కమీషన్ సెక్రటరీ విజయ్ కుమార్ (ఐఎస్) కు తెలిపామని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళ వారం రాజమండ్రి మంజీర హెూటల్‌లో రాష్ట్ర ప్లానింగ్ కమీషన్ సెక్రటరీ విజయకుమార్ అధ్యక్షత న జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కొవ్వూరు హాస్పిటల్‌కు పేషెంట్లు వెళ్తుంటే కొంతమంది ని రాజమహేంద్రవరం హాస్పిటల్ కి రిఫర్ చేస్తున్నారని వారు అక్కడ నుంచి కాకినాడకు రిఫర్ చేయడం ద్వారా పేషేంట్లు నానా ఇబ్బందులు పడుతున్నారుని తెలిపారు కొవ్వూరు లో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి హాస్పటల్ భవన నిర్మాణం జరిగిందని తగిన సిబ్బంది లేక ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నరని తెలిపారు. సుమారుగా2600 వ్యాధులను ఆరోగ్యశ్రీ లో చేర్చినప్పటికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ఆదేశాల మేరకు ప్రజలకు విద్య వైద్యం ఆరోగ్యం అందించవలసిన ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చోళ్ళ రాజు, దిద్దే రాజు పాల్గొన్నారు.

మార్చి 17 నుంచి మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ మెడీకాల్ ఎక్స్ పో

విశాలాంధ్ర-రాజమండ్రి : మెడ్ ఎక్స్పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద బీ2బీ మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ అయిన మెడీకాల్ మార్చి 17 నుండి 19 వరకు హైదరాబాద్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుందని మెడీకాల్ వ్యవస్థాపకులు ఎస్ మణివణ్ణన్ అన్నారు. ఈ మెడీకాల్ 32వ ఎడిషన్ సర్జికల్ కాటన్ నుండి అధునాతన ఇమేజింగ్ పరికరాలు, శస్త్రచికిత్సా ఉపకరణాల వరకు ఆసుపత్రిలోని అన్ని అవసరాలపై దృష్టి పెడుతుందన్నారు. మెడీకాల్ వారు షోస్టాపర్ అయిన ఒక ఇంటరాక్టివ్ బ్రెయిన్ స్టార్మ్ కూడా నిర్వహిస్తున్నారన్నారు. మెడీకాల్ లో, వైద్యం నిర్వహణ కలిసి మేధోపరంగా ఉత్తేజపరిచే సెమినార్లు, వర్క్ వర్క్ షాప్ లు, అన్కాన్ఫరెన్స్ లు, ఆసుపత్రులని నడపడంలోని వ్యాపార అంశాలపై పరిజ్ఞానాన్ని పొందడానికి, వ్యాప్తి చేయడానికి మెడికల్ ఫ్రైటర్నిటీ కోసం ఓపెన్ డిస్కషన్ సెషన్లని అందిస్తుందన్నారు. మెడీకాల్ బ్రెయిన్టెర్మ్ లోని ఇంటరాక్టివ్ హెల్త్ కేర్ ఇంటెలిజెంట్సియా క్లుప్తంగా జ్ఞానాన్ని అందిస్తుందన్నారు.

గ్రామ వలంటీర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం వార్డు వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు కోరారు. కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో గల వీర వెంకట సత్యనారాయణ కళ్యాణ మంటపంలో స్థానిక ఎంపీపీ మేడిసెట్టి సత్య వేణి దుర్గారావు అధ్యక్షతన మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో ఎమ్ఎల్‌సీ తోట ప్రసంగించారు. 2024వ సంవత్సరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు గృహసారథుల సారథ్యంలో అధికారం హస్తగతం చేసుకుంటుందని తోట ధీమా వ్యక్తంచేశారు. వార్డు వా లెంటీర్లు, గృహ సారథులకు ఏ సమస్య వున్నా నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని తోట కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఆర్ బి కే సలహా కమిటీ చైర్మన్ పుట్టా కృష్ణబాబు, మండల వైసీపీ కన్వీనర్ శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పుర వీధులలో సింహ వాహనంపై శ్రీవారు

విశాలాంధ్ర - రావులపాలెం : 14వ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారు సింహ వాహనంపై వేంచేసి పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు, వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు వార్ల బ్రహ్మత్వంలో ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సరస్వతి హెూమం ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలతో శ్రీ శ్రీనివాస శరణాగతి గోవింద మాలధారులతో గోవింద నామస్మరణలతో భజన, కోలాట బృందాలతో రామడోలు వాయిద్యాలతో, కేరళ వాయిద్యాలతో, భక్తజన సందోహం నడుమ, భగవన్నామ స్మరణలతో అత్యంత వైభవంగా గ్రామ పుర వీధులలో సింహ వాహనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి ముత్యాల పందిరిపై పుర వీధుల్లో అంగరంగ వైభవంగా స్వామి వారు విహరించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకోవడం వల్ల సమస్త కార్యసిద్ధి మనశాంతి కలుగుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి, పడాల బాపిరెడ్డి, మేడపాటి సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముదిరిన నకిలీ పత్రాల వ్యవహారం

ఒకరి ఆత్మహత్యాయత్నం : సమగ్ర విచారణకు డిమాండ్

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో రెవిన్యూశాఖ ద్వారా జారీ అయిన నకిలీ ధృవపత్రాల వ్యవహారం ముదిరి, ఒకరి ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న ఈ తంతుపై సమగ్ర విచారణ చేపట్టాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది. వివరాల్లోకి వెళితే...విస్సన్నపేట ఎస్సీవాడకు చెందిన నందిపాం దానియేలు అనే రైతు తాను సాగు చేస్తున్న భూమిని ఆన్‌లైన్ చేయాలని తన వద్ద ఉన్న పత్రాలతో రెవిన్యూ అధికారులను సంప్రదించారు. ఇది జాప్యం జరగటంతో కొందరు గ్రామ పెద్దల ద్వారా అధికారులపై ఒత్తిడి తేవటంతో దానియేలు వద్ద ఉన్నవి నకిలీ పత్రాలుగా అధికారులు నిర్ధారించటంతోపాటు, పోలీసుశాఖను విచారించాలని కోరారు. ఈ విషయం మంగళవారం 'విశాలాంధ్ర' దినపత్రికలో 'నకిలీ ధృవపత్రాల కలకలం' అనే శీర్షికతో వార్త ప్రచురితమయ్యింది. ఈలోగా పోలీసులు విచారణ పేరుతో తనను పిలిచారని, సంబంధిత భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ కోసం రూ.1.5లక్షలు ఖర్చు చేయగా, అధికారులు న్యాయం చేయకపోగా తన వద్ద ఉన్న కాగితాలు నకిలీవిగా ధృవీకరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారనే ఆవేదనతో దానియేలు మంగళవారం పురుగుమందు సేవించి, ఆత్మహత్యాయత్నం చేశారు. గుర్తించిన కుటుంబసభ్యులు క్షతగాత్రుడిని విజయవాడ తరలించి, వైద్యసేవలందిస్తున్నారు. ఇదే శాఖలో గతంలో నకిలీ పొజిషన్ ధృవీకరణలతో కొందరు ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నం చేయటం, ఇది వివాదానికి దారి తీసి, పోలీసులకు ఫిర్యాదు చేసుకోవటం జరిగింది. మరికొందరు న్యాయస్థానాలను ఆశ్రయించగా, విచారణ కొనసాగుతోంది.

సామరస్య పూర్వంగా ప్రజలకు పోలీసులు సేవలు అందించాలి

విశాలాంధ్ర - గుడివాడ : ప్రజలతో మమేకమవుతూ సామరస్య పూర్వకంగా పోలీస్ సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించిన జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. బుధవారం స్థానిక గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డిఎస్పి సత్యానందంతో కలసి జిల్లా ఎస్పీ జాషువా అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుడివాడలో డిఎస్పి సత్యానందం పర్యవేక్షణలో పోలీస్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎక్కువగా భర్య, భర్తల మధ్య ఎక్కువగా సమస్యలు ఏర్పాడం జరుగుతునయన్నారు. వారికి ప్రతేకంగా కౌన్సింగ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళా పోలీసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలీసులకు అవసరమైన విలువైన సమాచారాన్ని అందించడంలో మహిళా పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐలు జయకుమార్, గోవిందరాజులు, తులసీదర్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.